సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 5 । జనవరి । 2025



మంత్రి కాన్ఫరెన్స్‌కు హాజరు

పెద్దపల్లిరూరల్: రోడ్డు భద్రత నియమావళిపై మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణు హాజరయ్యారు.



రైతుకు సంక్రాంతి పురస్కారం

రామగిరి: ప్రకృతి, సేంద్రియ విధానంలో పురాతన వరి విత్తనాలతో సాగుచేస్తున్న కల్వచర్లలోని అభ్యుదయ రైతు శ్రీనివాస్ ఏపీ ప్రభుత్వం నుంచి సంక్రాంతి పురస్కారం అందుకున్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/13.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండ కాస్తుంది. ఉదయం, రాత్రి వేళల్లో చలితీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉన్నతంగా ఎదగాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం అరికె శ్రీనివాస్, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లీగల్ సెల్ సర్వీసెస్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

జ్యోతినగర్(రామగుండం): రోడ్డు ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు సూచించారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో శనివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హెచ్‌ఎం తిరుపతి గౌడ్, ఏఎంవీఐలు ప్రదీప్‌సాగర్, నిఖిల్ కుమార్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్, కానిస్టేబుళ్లు రఘుపతి, నసీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామనే హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బల్దియాతోపాటు సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం కార్మికులు ధర్నా చేశారు. పెద్దపల్లిలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, సుల్తానాబాద్ మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, సహాయకార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలన్నారు. నాయకులు వెంకటస్వామి, చంద్రయ్య, సాగర్, రాజయ్య, రవి, మరియ, దేవమ్మ, పాక మహేశ్, రమేశ్, మల్లేశ్, సురేశ్, లక్ష్మణ్, రామ్మూర్తి, లక్ష్మి, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

‘మోడల్’ విద్యార్థినికి ప్రశంస



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సింధూప్రియ అండర్– 19 వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం జట్టు తరఫున సింధూప్రియ హాజరవుతుందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీలు బైకని కొమురయ్య, సంజీవరావు అభినందించారు.

ప్రతిభా పాటవ పోటీల్లో సత్తా



బహుమతి అందిస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులు సత్తాచాటారు. స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ పోటీల్లో సింధూజ, స్నేహిత, అర్షిత, అనూష, సోహెల్, సాయిప్రసాద్, అమృత, రాహుల్, సన ప్రతిభ చూపారు. ఈనెల 21న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, రాజనర్సు తెలిపారు. ఆర్డీవో గంగయ్య విజేతలకు బహుమతు అందించారు. సమన్వయకర్త పీఎం షేక్, ఎంఎన్‌వో ఆగయ్య, హెచ్‌ఎం పురుషోత్తం, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవహారంతో నిరసన



రాస్తారోకో చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్‌తో సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం స్థానిక బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. 26రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుధాకర్, తిరుపతి, స్వప్న, మంజుల ఉన్నారు.



సండే స్పెషల్

సైకిల్ సవారీ.. ఆరోగ్య దారి

సైకిల్.. గతంలో రవాణా సాధనంగా ఉండేది. క్రమేణా నేడు దాని ఉపయోగం తగ్గింది. చిన్న పిల్లలు మాత్రమే క్రీడలు, వినోదం కోసం వినియోగిస్తున్నారు. ఏ చిన్న పనికి ఇంటి నుంచి బయటకు వెళ్లినా బైక్‌లపై రయ్‌మని వెళ్తున్న రోజులివి. పురుషులు ద్విచక్రవాహనాలు, మహిళలు స్కూటీలు, వృద్ధులు లూనా, ఎక్సెల్ వాహనాలు వాడుతున్నారు. వాటి నుంచి వచ్చే పొగతో వాతావరణం కాలుష్యమవుతోందన్న విషయం అందరికీ తెలిసిన విషయమే. అయినా, ఆయా వాహనాలను వినియోగించకుండా ఉండలేరు. ప్రపంచీకరణ ప్రభావంతో జీవితంలో వేగంతోపాటు వాహన వినియోగమూ పెరిగింది. తద్వారా సైకిల్ ఉపయోగం క్రమంగా తగ్గిపోయింది. అయినప్పటికీ సైకిల్‌ను పర్యావరణహిత రవాణా సాధనంగా చాలా దేశాలు గుర్తించాయి. దాని వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఉరుకులు పరుగుల జీవితంలో శరీరానికి వ్యాయామం ఉండటం లేదు. ఇది అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. సైకిల్‌కు లైఫ్ ఎక్కువ. సైక్లింగ్ చేసే వారి జీవిత కాలమూ ఎక్కువే అనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో సైక్లింగ్ చేయడం ఆరోగ్యకరమని గుర్తించిన చాలామంది దానివైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా సైకిల్ పూర్వవైభవం సంతరించుకుంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సైక్లింగ్ చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది.

ప్రతీరోజు సైక్లింగ్ చేస్తా

ఆరోగ్య రక్షణలో ప్రస్తుతం సైకిల్‌ది ప్రధాన పాత్ర. నిత్యం సైక్లింగ్ చేయడం వల్ల కీళ్లకు, కండరాలకు తగిన వ్యాయామం జరుగుతుంది. నేను ప్రతీరోజు ఉదయం, సాయంత్రం అరగంట సైక్లింగ్ చేస్తాను. దీనివల్ల అనారోగ్య సమస్యలు చాలా వరకు తగ్గుతాయి.
– మెతుకు హేమలత, న్యాయవాది, హరిహరనగర్, కరీంనగర్

డాక్టర్స్ ఫిట్‌నెస్ మంత్ర

కరీంనగర్ మండలంలోని నగునూరు ప్రతిమ ఆస్పత్రి వైద్యులు తమ ఆరోగ్య రక్షణలో భాగంగా సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. గుండె వైద్య నిపుణుడు కె.రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు సంజీవ్, మానస పుఖాన్‌ల బృందం ప్రతీరోజు 20 కిలోమీటర్ల వరకు సైక్లింగ్ చేస్తున్నారు. ఆదివారం ప్రత్యేకంగా 40 కిలోమీటర్లు వెళ్తామని, సైక్లింగ్ వల్లే కోవిడ్ సమయంలో ఆరోగ్యంగా ఉన్నామని తెలిపారు. సహచర వైద్యులతో కలిసి పదేళ్లుగా సైక్లింగ్ చేస్తున్నానని, ఆరోగ్యంతోపాటు శరీరం ఫిట్‌గా ఉండేందుకు ఇది దోహదపడుతుందని రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.



సైకిళ్లతో ప్రతిమ ఆస్పత్రి వైద్యులు

చురుగ్గా.. ఆరోగ్యంగా



కరీంనగర్ టౌన్: సైకిల్ తొక్కడం వల్ల కండరాలు బలోపేతం అవుతాయి. శరీరానికి శక్తి, చక్కని దేహాకృతితో పాటు ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండి శ్వాసకోశ సమస్యలు దూరం అవుతాయి. శరీరంలో ఆక్సిజన్‌స్థాయి పెరిగి యాక్టివ్‌గా ఉంటారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు సైకిల్ తొక్కడం అలవాటు చేసుకుంటే కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. గుండెకు చక్కని వ్యాయామం ఉంటుంది. అధిక బరువు తగ్గాలని అనుకునేవారికి సైక్లింగ్ గొప్పవరం. శరీరంలోని కీలక భాగాల్లో కొవ్వు కరిగిపోతుంది. మానసిక ఆరోగ్యం సైతం మెరుగుపడుతుంది.
– ఎనమల్ల నరేశ్, క్రిటికల్ కేర్ నిపుణులు, ఐఎంఏ అధ్యక్షుడు

స్కూల్‌కు సైకిల్‌పై వెళ్తున్న టీచర్లు



ఉయ్యాల రమేశ్



గుండు విజయ్

కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ సైన్స్ టీచర్ ఉయ్యాల రమేశ్ స్వగ్రామం కోరుట్ల మండలం ఏఖీన్‌పూర్. గతంలో బైక్‌పై పాఠశాలకు వచ్చి, వెళ్లేవారు. వాతావరణ కాలుష్యం గురించి విద్యార్థులకు బోధిస్తున్న తాను ఆచరించడ లేదని భావించి, రెండేళ్ల క్రితం సైకిల్ కొనుగోలు చేశారు. ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి మొత్తం 25 కిలోమీటర్లు వెళ్లేందుకు సైకిల్‌నే వాడుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు మార్గదర్శిగా ఉండటంతోపాటు వ్యాయామం చేసినట్లవుతోందని ఆయన చెబుతున్నారు. గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన గుండు విజయ్ తాండ్ర్యాల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. బైక్‌పై వెళ్తే పొగ వెలువడి, వాతావరణం కాలుష్యమవుతుందని ప్రతీరోజు సుమారు 2 కిలోమీటర్లు స్కూల్‌కు సైకిల్‌పై వెళ్లి వస్తున్నారు.

– మిగతా 8లో

పట్టణ రూపురేఖలు మార్చుతా

• పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



బిరుదు రాజమల్లు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణ రూపురేఖలు మార్చుతానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పూసాల రోడ్డులో చేపట్టిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు విగ్రహ ఏర్పాటు స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. పదేళ్లుగా పట్టణం అభివృద్ధి చెందలేదని, తాను పూర్వవైభవం తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తిచేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, గాజుల లక్ష్మి, మినుపాల ప్రకాశ్‌రావు, బిరుదు సమత, వేగోళం అబ్బయ్యగౌడ్, చిలుక సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా నాటు వేయండి

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దాపూర్ పెద్దచెరువు వద్ద ప్రారంభమయ్యే హుస్సేన్‌మియావాగు ద్వారా ఐదు మండలాలకు సాగునీరు అందుతుందని, ఈసారి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా యాసంగి పంటలకు సాగునీరు అందుతుందని, రైతులు నిర్భయంగా వరి నాట్లు వేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. పెదపూర్ పెద్ద చెరువు మత్తడి, నీటినిల్వలు, హుస్సేన్‌మియావాగు పరిసరాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాకతీయ కాలువపై రెవెల్లి వద్ద ఉన్న క్రాస్ రెగ్యులేటరీ డిస్ట్రిబ్యూషన్ నుంచి పెద్దచెరువును నింపి జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని చెప్పారు. నాయకులు గండు సంజీవ్, కొమ్మ పోచాలు, వేణుగోపారావు, బొజ్జ శ్రీనివాస్, జక్కని శంకరయ్య, బండి స్వామి, సిరికొండ కొమురయ్య, చెరుకు కనుకయ్య, పెసరు స్వామి పాల్గొన్నారు.

నియామకం



నార కిశోర్‌రెడ్డి

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నార కిశోర్‌రెడ్డిని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి(ఎఫ్ఏసీ) లోకేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేసిన కిశోర్‌రెడ్డిని ఇదే సంస్థకు చైర్మన్‌గా నియమించారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి

• అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశం



లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): నగరంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కార్పొరేషన్ ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్యం నిర్వహణ, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మల్కాపూర్‌లోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ భవనం పరిశీలించారు. రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీని సందర్శించారు. కమిషనర్, ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదు తనిఖీ చేశారు. రెండురోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్‌లో అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ శివానంద్, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఈఈ రామన్ పాల్గొన్నారు.

వైద్య సేవలు భేష్

• కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంస



వైద్యసేవలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు మెరుగ్గా అందుతున్నాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసించారు. జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్యసేవలు అందించేందుకు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. ఇందుకోసం అన్నివసతులు కల్పించామని, శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. గతేడాది డిసెంబర్‌లో 7,695 మంది ఔట్ పేషెంట్లు, 838 మంది ఇన్‌పేషెంట్లు చికిత్స పొందారని తెలిపారు. 113 మంది కంటి, 55 మందికి ఎముకల చికిత్స, 33 మందికి జనరల్ శస్త్రచికిత్స చేశామని వివరించారు. పిల్లల విభాగంలో 2,669 మంది ఓపీ, 291 మంది ఇన్‌పేషెంట్లుగా సేవలు పొందారని తెలిపారు. డిసెంబర్‌లో 192 ప్రసవాలు జరిగాయని అన్నారు. అనంతరం పెద్దపల్లి, మంథని సూపరింటెండెంట్లు శ్రీధర్, రాజశేఖర్‌తోపాటు వైద్యులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిఖని జనరల్ ఆస్పత్రి సేవలపై సమీక్ష

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సేవలపై కలెక్టర్ శ్రీహర్ష సమీక్షించారు. సేవలు మెరుగుపర్చేందుకు జనరేటర్, పేయింగ్ గదులు, ఏఆర్‌టీ సెంటర్, ప్రసూతి ఇన్సెంటివ్ కేర్ యూనిట్ మంజూరు చేసామని తెలిపారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి సేవలు అందుబాటులోకి తేవాలని సూచించారు. సింగరేణి మెడికల్ కాలేజీ నిర్వహణకు సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి, దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రతీరోజు చెత్త సేకరించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరయ్యేలా ప్రతీరోజు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ 97శాతం పూర్తయిందని, పెండింగ్ సర్వేను వెంటనే పూర్తిచేయాలని అన్నారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్, డంపింగ్‌యార్డ్‌కు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. కాట్నపల్లిలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. నర్సరీని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

• వచ్చీరాని వైద్యంతో పేషెంట్లకు ప్రాణసంకటం • ధనార్జనే ధ్యేయంగా కొందరు వైద్యుల తీరు
• పరిహారంతో సరిపెడుతున్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు

2024 సెప్టెంబరు 13న

జ్వరంతో బాధపడుతున్న ఏడు నెలల పసికందును పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. హైడోసు మందులు ఇవ్వడంతో పరిస్థితి విషమించిందింది. దీంతో వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేయగా.. అక్కడకు తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలోనే చనిపోయింది. ఆగ్రహించిన బంధువులు.. తిరిగి వచ్చి ఆస్పత్రిని ధ్వంసం చేశారు. వైద్యుడిపై కత్తితో దాడి చేశారు. సమస్య పరిష్కారం కోసం బాధిత కుటుంబానికి వైద్యుడు ‘తగిన’ పరిహారం చెల్లించినట్లు సమాచారం.

కొద్దిరోజుల క్రితం..

కడుపునొప్పితో బాధపడుతూ వచ్చిన ఓ మహిళకు సర్జరీ చేసిన వైద్యురాలు.. కడుపులోనే కాటన్ మర్చిపోయి కుట్లు వేశారు. కొద్దిరోజుల తర్వాత బాధితురాలికి కడుపునొప్పి తీవ్రం కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించింది. పరీక్షించిన వైద్యులు.. ఆమె కడుపులో కాటన్ ఉందని గుర్తించారు. బాధితురాలు బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డాక్టర్‌ను సస్పెండ్ చేశారు.



పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రి ఎదుట గుమిగూడిన బంధువులు, రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాదు.. ప్రైవేట్ దవాఖానాల్లోనూ పేషెంట్లకు నమ్మకమైన వైద్యం అందడంలేదనే దానికి ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన యువకుడు ఆకుల శ్రావణ్.. జ్వరంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గత గురువారం చేరాడు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిందని చెప్పి ఇంజక్షన్‌తోపాటు, హైడోస్ మందులు ఇవ్వడంతో శ్రావణ్ చనిపోయాడని బంధువులు నిరసన తెలిపారు. దిగొచ్చిన యాజమాన్యం.. బాధిత కుటుంబసభ్యులకు రూ.15లక్షలు పరిహారం చెల్లించి రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయం తమ దృష్టికి రాలేదని డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి, తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. జిల్లాలో అనూహ్యంగా చోటుచేసుకుంటున్న ఇలాంటి ఘటనలు కొందరు వైద్యుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తున్నాయి.

సాక్షి ఫోటో సాక్షి

ధనార్జనే ధ్యేయం..

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు మెరుగైన వైద్య చికిత్సల కోసం దేవునితో సమానమైన ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తే.. ధనార్జనే ధ్యేయంగా కొందరు డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జ్వరంతో ఆస్పత్రికి వెళ్తే.. పేషెంట్లలో లేనిభయాన్ని సృష్టిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ వైద్యుడు ఏచిన్న జబ్బుతో ఆస్పత్రికి వెళ్లినా మూడురోజుల పాటు ఇంజక్షన్లు తీసుకోవాలని.. హైడోస్ ఇస్తూ కొత్త వ్యాధులు ప్రబలేందుకు తెరతీస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా కొందరు వైద్యులు మెడికల్, ల్యాబొరేటరీ దందాలు కూడా వారే నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.


అధికారుల పర్యవేక్షణ కరువు..

జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాప్‌లు, లాబొరేటరీల వైపు సంబంధిత వైద్యాధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా.. ఇరుకైన గదుల్లోనే ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నారని, అనూహ్యంగా ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ తీరుపై దృష్టి సారించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



కు.ని. ఆపరేషన్లపై అవగాహన అవసరం

• డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి సూచించారు. కలెక్టరేట్‌లో ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలతో ఆమె శనివారం సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, తాత్కాలిక కుటుంబ నియంత్రణ కోసం పరుషులు కండోమ్ వినియోగించడంపై అవగాహన కల్పించాలన్నారు. కోత, కుట్టులేని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకునేలా దంపతులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే క్షయ నిర్మూలన కోసం చేపట్టిన నిక్షయ్ శిబిరాల్లో తెమడ పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. వైద్యాధికారులు సిఫారసు చేసిన రక్తనమూనాలను సేకరించి వివరాలను సరిగ్గా నమోదు చేసి ఫలితాలను అదేరోజు అందించేలా చూడాలని ఆదేశించారు. ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోతే స్టాఫ్‌నర్స్‌లు రక్త నమూనాలు సేకరించాలని ఆమె సూచించారు. ప్రోగ్రాం అధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శారీరక దృఢత్వం అవసరం

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచన



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ(రామగుండం): శరీరం దృఢంగా ఉంటేనే ఆలోచనా శక్తి మెరుగ్గా పనిచేస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పోలీస్ కమిషనరేట్‌లో శనివారం స్పెషల్ పార్టీ పోలీసులకు గ్రేహౌండ్స్ తరహా శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రేహౌండ్స్ సిబ్బంది వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, నక్సలైట్ల ఏరివేతకు పొందిన శిక్షణ తరహాలోనే రామగుండం పోలీస్‌లను తీర్చిదిద్దుతామన్నారు. స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ పోలీసు సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, ఆయుధ వినియోగం, కోల్ నా, జోల్ నా, పార్ట్స్ నేమ్స్, పార్ట్స్ పనితీరు, అడవుల్లో పోరాటంపై తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు. అడవుల్లో సంచరిస్తూ మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణ సందర్భంగా ప్రతిభ చూపిన వారికి రివార్డులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, సంపత్, మల్లేశం, ఆర్‌ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈతవనాల పరిశీలన



విచారణ చేస్తున్న ఆర్డీవో గంగయ్య

పాలకుర్తి(రామగుండం): సోలార్ పవర్ ప్లాంట్ కోసం రాణాపూర్ గ్రామ శివారులో ఎన్టీపీసీ తొలగించిన ఈతవనాలను పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే కన్నాల, రాణాపూర్ గౌడకులస్తులు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయికి చేరుకున్నారు. గీతకార్మికులను కలిసి వివరాలు సేకరించారు. ఈతవనాల తొలగింపుతో తాము ఉపాధి కోల్పోతున్నామని గౌడ కులస్తులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని వేడుకున్నారు. స్థానిక పరిస్థితుల గురించి ఉన్నతాధికారులకు వివరిస్తామని ఆర్డీవో వారికి వివరించారు. ఎక్సైజ్ సీఐ మంగమ్మ, తహసీల్దార్ జ్యోతి, ఆర్‌ఐ ఇంతియాజ్, కన్నాల, రాణాపూర్, ఎల్కలపల్లి గ్రామాల గౌడకులస్తులు పాల్గొన్నారు.

సైకిల్ సవారీ.. ఆరోగ్య దారి

- చక్కటి వ్యాయామమంటూ సైక్లింగ్ వైపు మొగ్గు
- నిత్యం కొన్ని కి.మీ. వెళ్తున్న పలువురు ఉమ్మడి జిల్లా వాసులు

కరీంనగర్ స్పోర్ట్స్/విద్యానగర్(కరీంనగర్)/సిరిసిల్ల కల్చరల్/కరీంనగర్‌రూరల్/జ్యోతినగర్(రామగుండం)/కథలాపూర్(వేములవాడ)/: 2018 ఏప్రిల్‌లో ఐక్యరాజ్యసమితి ఏటా జూన్ 3వ తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. దాని ప్రకారం ప్రపంచ దేశాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. సైకిల్ దాని బరువు కంటే 12 రెట్ల భారాన్ని మోసుకెళ్లగలదు. మనిషి పరుగెత్తే వేగం కంటే 6 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణం చేయగలదు. నిర్వహణ వ్యయం చాలా తక్కువ. సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు వివిధ సంస్థలు సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నాయి. మార్కెట్లో సైకిళ్లు రూ.4 వేలు మొదలుకొని రూ.15 వేల వరకు ధరల్లో లభిస్తున్నాయి. ప్రత్యేకంగా సైక్లింగ్ కోసమైతే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటున్నాయి.

కరీంనగర్‌లో 200 మందికి పైగా..



మానేరు డ్యాం కట్టపై సైక్లిస్టులు

ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు ప్రజలు సైక్లింగ్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవారి సంఖ్య పెరగగా.. ఇటీవలి కాలంలో సైక్లింగ్ చేసేవారి సంఖ్య కూడా పెరగడం విశేషం. కరీంనగర్ సిటీలో 200 మందికి పైగా సైక్లింగ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో అయితే కొందరు కరీంనగర్ నుంచి ప్రజ్ఞాపూర్, రామగుండం, వరంగల్, సిరిసిల్ల వరకు వెళ్లి, వస్తున్నారు. కరీంనగర్ మానేరు డ్యాం కట్ట(సుమారు 4 కిలోమీటర్లు)పై నిత్యం 50 మందికి పైగా సైక్లింగ్ చేస్తున్నారు.

30 ఏళ్లుగా ఇదే నా వాహనం..



మేకల నారాయణ

శంకరపట్నం(మానకొండూర్): తాను 30 ఏళ్లుగా సైకిల్‌పైనే కూలీ పనులకు వెళ్తున్నానని శంకరపట్నం మండలంలోని కేశవపట్నంకు చెందిన మేకల నారాయణ అంటున్నాడు. ఇదే తన వాహనమని, స్థానికంగా పనులు లేకుంటే సైదాపూర్ మండలానికి వెళ్లి, చేస్తున్నానని తెలిపాడు. సైకిల్ తొక్కడం వల్లే తాను ఆరోగ్యంగా ఉంటున్నానని పేర్కొన్నాడు.

ఏకాగ్రత పెరుగుతుంది



2022లో మా కుమారుడు శ్రీహర్షరెడ్డి స్ఫూర్తితో నేను సైక్లింగ్ ప్రారంభించా. రెండు సార్లు సూపర్ రెండోనర్ అవార్డులు సాధించాను. లాంగ్ రైడ్ హైదరాబాద్ నుంచి గోవా వరకు 1,200 కిలోమీటర్లు వెళ్లాను. సైకిల్ తొక్కడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మోకాళ్ల నొప్పులు తగ్గిపోతాయి.

– వెంకట తిరుపతి రెడ్డి, ఈపీ ఆపరేటర్, సింగరేణి, ఎన్టీపీసీ కృష్ణానగర్



సిరిసిల్లలో సైక్లింగ్ చేస్తున్న పట్టణవాసులు

ప్రయోజనాలు ఇవీ..

- సైకిల్ తొక్కడం వల్ల ఎముకలు, కండరాలు బలపడతాయి. ఉదయం సైక్లింగ్ చేస్తే స్వచ్ఛమైన గాలి అంది, మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- సైక్లింగ్ హృదయ స్పందన రేటు మెరుగుపరుస్తుంది. శరీరంలోని కొవ్వుతోపాటు బరువు తగ్గిస్తుంది.
- శరీరంలోని గ్లూకోజ్ లెవెల్స్ తగ్గి, మధుమేహం అదుపులో ఉంటుంది.
- శ్వాస్వక్రియ మెరుగుపడుతుంది. గుండె, శ్వాస సంబంధిత సమస్యలు దూరమవుతాయి.
- జీవక్రియలు మెరుగుపడటంతోపాటు శరీరం శక్తిని సక్రమంగా వినియోగించుకుంటుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

బాలయ్యగౌడ్.. 57 ఏళ్లుగా..



ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం కేంద్రానికి చెందిన అంతటి బాలయ్య గౌడ్ కల్లు గీసేందుకు వెళ్లడానికి 57 ఏళ్లుగా సైకిల్ వినియోగిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన వయసు 82 ఏళ్లు. తనకు మోటార్ సైకిల్ తోలడం రాదని, చిన్నప్పటి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్ మీదే పోతున్నానని తెలిపాడు. ఇది ఆరోగ్యానికి మేలని, ఈ వయసులో కూడా తనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని అంటున్నాడు.

మధుపుదారులకు సైకిళ్ల పంపిణీ



మురళి

రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఆడెపు మురళి 40 ఏళ్ల చిట్‌ఫండ్ సంస్థ నిర్వహిస్తున్నాడు. సైకిల్ సవారీ శరీరాన్ని ఉత్తేజంగా ఉంచుతుందని నమ్మాడు. ప్రతీరోజు అరగంట సైక్లింగ్ చేస్తున్నాడు. గతేడాది దీపావళి సందర్భంగా తన సంస్థకు చెందిన ఉత్తమ మదుపుదారులు 100 మందిని ఎంపిక చేసి, సైకిళ్లు గిఫ్ట్‌గా ఇచ్చాడు. తెలిసినవారి ఇళ్లలో శుభకార్యాలకు వెళ్లినా వీటినే కానుకగా ఇస్తున్నాడు. తన కష్టమర్లతోపాటు అయినవారు బాగుండాలనే ఇలా చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

తాత, తండ్రి వాడిన సైకిల్..



సురేందర్

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన రావికంటి సురేందర్ రిటైర్డ్ టీచర్. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీ విరమణ పొందే వరకు సైకిల్‌పైనే విధులకు హాజరయ్యారు. ఈ సైకిల్‌ను తన తాత శంకరయ్య, టీచర్‌గా తండ్రి సాంబయ్య వినియోగించారని తెలిపారు. చిన్న చిన్న మార్పులు చేసి, తానూ వాడుతుండటం సంతోషంగా ఉందని చెబుతున్నారు. సైకిల్‌తో ఆరోగ్యం, పర్యావరణ రక్షణ, డబ్బు ఆదా అని అంటున్నారు.

సైకిల్ టెక్స్ రాజన్న..



సైకిల్ రిపేర్ చేస్తున్న రాజన్న

మల్యాల(చొప్పదండి): ఇతని పేరు కుర్రె రాజన్న. మల్యాల గ్రామం. చిన్నప్పుడే సైకిల్ టెక్స్‌లో జీతం ఉండి, రిపేరింగ్ నేర్చుకున్నాడు. 1971లో సొంతంగా 6 సైకిళ్లతో షాపు పెట్టాడు. గంటకు పావలా, అర్ధ రూపాయి, రూపాయికి కిరాయికి ఇచ్చేవాడు. 20 ఏళ్ల కింద ఆ షాపు తీసేశానని తెలిపాడు. సైకిల్ రిపేర్లు మాత్రం చేస్తున్నానని, 55 ఏళ్లుగా ఇదే తనకు ఉపాధి అని పేర్కొన్నాడు. అందుకే తనను అందరూ సైకిల్ టెక్స్ రాజన్నగా పిలుస్తారన్నాడు.

ఉపశమనం కలుగుతోంది



నా వర్క్ బిజీ లైఫ్‌లో నాకు సైక్లింగ్‌తో ఉపశమనం కలుగుతోంది. రెండున్నరేళ్లుగా సైకిల్ తొక్కుతున్న. ప్రతీరోజు 20 నుంచి 25 కిలోమీటర్లు వెళ్తా. ప్రతీ ఒక్కరు రోజూ ఉదయాన్నే ఏదో ఒక వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారు.

– ఎం.సంపత్, హెడ్‌కానిస్టేబుల్, కరీంనగర్

తొక్కితే ఆరోగ్యం..



లింగయ్య

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేటకు చెందిన ఇల్లందుల లింగయ్య 45 ఏళ్లుగా సైకిల్‌పైనే ప్రయాణిస్తున్నాడు. ఇప్పటివరకు తనకు షుగర్, బీపీ తదితర అనారోగ్య సమస్యలు లేవని అంటున్నాడు. యువకులు మోటార్ సైకిళ్లపై తిరుగుతూ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, చెబుతున్నాడు. సైకిల్ తొక్కితే ఆరోగ్యమని అంటున్నాడు.

మూడేళ్ల క్రితం అలవాటైంది



కరీంనగర్ అర్బన్: నాకు మూడేళ్ల క్రితం సైక్లింగ్ అలవాటైంది. మూగజీవాలకు వైద్యం అందించడంలో అవిశ్రాంతంగా కృషి చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి మానసిక ఆందోళన కలిగేది. అప్పుడే ఆరోగ్యంపై దృష్టిసారించాను. అంతకుముందు జిమ్, ఇతర కసరత్తులు చేసేవాడిని. సైక్లింగ్‌తో శరీరంలోని ప్రతీ అవయవానికి వ్యాయామమే.

– తుమ్మల కిరణ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి, కరీంనగర్

నిత్యం 35 కిలోమీటర్లు..



భూమయ్య

కోరుట్ల: సంగెం గ్రామానికి చెందిన బోగ భూమయ్య 45 ఏళ్లుగా నిత్యం 35 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్తున్నాడు. చిరు వ్యాపారం చేసుకునే తాను సంగెం, నాగులపేట, యెఖీన్‌పూర్, కథలాపూర్ మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామాలు సైకిల్‌పైనే చుట్టి వస్తున్నట్లు తెలిపాడు. మోటార్ సైకిల్ కొనే స్తోమత ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం సైకిల్‌నే వాడుతున్నానని భూమయ్య చెబుతున్నాడు.

ఉపాధి.. ప్రయాణం



మహేశ్

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన గుంటుక మహేశ్ మూడున్నర దశాబ్దాలుగా సైకిల్ వినియోగిస్తున్నాడు. తొలుత సైకిల్ స్టోర్‌లో పని చేసి, 25 ఏళ్ల క్రితం సొంతంగా షాపు పెట్టుకున్నాడు. ఉపాధి పొందడంతోపాటు ప్రయాణానికి సైకిల్‌నే వినియోగిస్తున్నట్లు తెలిపాడు. స్నేహితులు బైక్ కొనుక్కోమని తరచూ చెప్పుతున్నా.. సైకిల్‌తో ఉన్న బంధం వల్ల కొనుగోలు చేయడం లేదని అంటున్నాడు.

రాష్ట్రమంతా సరఫరా చేస్తున్న



కోల్‌సిటీ(రామగుండం): శ్రీవెంకటేశ్వర సైకిల్స్ పేరిట గోదావరిఖనిలో సైకిల్ షోరూం నిర్వహిస్తున్న. హైదరాబాద్ మినహా రాష్ట్రమంతా సైకిళ్లు సరఫరా చేస్తున్న. యాంత్రిక జీవనంలో అనేక ఒత్తిళ్లతో నలిగిపోతున్న చాలా మంది సైక్లింగ్‌పై దృష్టి పెడుతున్నరు. ప్రతీ నెల 200 వరకు విక్రయిస్తున్న.

– ఆడెపు శంకర్, సైకిల్ షోరూం ఎండీ, గోదావరిఖని

శరీరానికి మంచి వ్యాయామం



సైక్లింగ్ శరీరానికి మంచి వ్యాయామం. అధిక బరువును తగ్గిస్తుంది. రక్తప్రసరణ మెరుగుపడి, గుండె రక్తనాళాల్లో అడ్డంకులు లేకుండా చేస్తుంది. బీపీ, షుగర్ ఉన్నవాళ్ల సైక్లింగ్ చేస్తే తప్పకుండా మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ సీహెచ్.ప్రదీప్‌కుమార్, లైఫ్‌లైన్ హాస్పిటల్, కరీంనగర్

హలో.. నేను ఎస్సైని మాట్లాడుతున్నా..

- బులియన్ మార్కెట్‌లో ఫోన్‌కాల్స్ కలకలం
- పోలీసులమని చెప్పి 30 మంది వ్యాపారులకు ఫోన్లు
- దొంగబంగారం తాకట్టు పెట్టుకున్నారని బెదిరింపు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ(రామగుండం): 'హలో నేను రామగుండం పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సైని మాట్లాడుతున్న.. మీరు దొంగ బంగారం తాకట్టుపెట్టుకొని డబ్బులిచ్చారు.. మా అదుపులో ఆ దొంగ ఉన్నాడు. మీ అడ్రస్ చెప్పాడు.. వెంటనే సెటిల్ చేసుకోండి.. ఫోన్‌పే లేదా గూగుల్‌పేలో డబ్బులు పంపించండి.. లేకుంటే మీకు ఇబ్బందులు తప్పవు... వెంటనే సెటిల్ చేసుకుంటే కేసులో మీ పేరు లేకుండా చేస్తా' అని గోదావరిఖనిలోని బులియన్ మార్కెట్ వ్యాపారులకు శనివారం బెదిరింపు ఫోన్లు వచ్చాయి. సుమారు 25 నుంచి 30 మంది వరకు ఇలా ఫోన్ల బారిన పడ్డారు. ఇదంతా అపరిచితులు ఫేక్‌కాల్ చేశారని తెలియడంతో వ్యాపారులు ఆ తర్వాత ఊపిరి పీల్చుకున్నారు. బాధితుల కథనం ప్రకారం.. గోదావరిఖనిలోని నగల దుకాణా యజమానులు, గోల్డ్‌స్మిత్ పనులు చేసేవారికి శనివారం వరుసగా ఫేక్ ఫోన్‌కాల్స్ వచ్చాయి. షాప్, యజమాని పేరుతో సహా చెబుతూ బెదిరింపులకు దిగారు. దీంతో వ్యాపారులు హడలెత్తిపోయారు. అప్రమత్తమైన స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కొండపర్తి నరహరి ఫోన్‌కాల్స్ ఫేక్ అని, ఎవరు కూడా భయపడి డబ్బులు ఇవ్వవద్దని స్వర్ణకారుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. దీంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు. 'అసలు మీరు ఎవరు? రామగుండం పోలీసులు అందరూ మాకు తెలుసు.. ఫోన్‌లో కాదు.. మీరెవరో డైరెక్ట్‌గా మా ముందుకు రండి.. లేకుంటే పోలీస్ కమిషనర్ వద్దకు మేమే వస్తా' అని వ్యాపారస్తులు నిలదీశారు. దీంతో ఫోన్‌చేసిన వ్యక్తులు వెంటనే ఫోన్ కట్ చేశారు. షాపులు తెరిచే సమయానికి ఇలా గందరగోళం ఏర్పడడంతో వ్యాపారులు భయంతో వణికిపోయారు. కొందరు దుకాణాలను కూడా తీయలేదు. మరికొందరు తీసిన దుకాణాలను మూసివేసి ఇంటికి వెళ్లారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి.. బులియన్ మార్కెట్‌కు చేరుకున్నారు. సైబర్ క్రైమ్ నేరాలు, ఫేక్‌కాల్స్‌తో మోసాలకు పాల్పడుతున్న తీరు గురించి వివరించారు. భయపడి అపరిచితులకు ఎవరూ డబ్బులు పంపించవద్దని సూచించారు. ఇలాంటి మోసపూరిత ఫోన్ కాల్స్ వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా రవికుమార్



వీసీ ఉమేశ్‌కుమార్‌ను కలిసిన రవికుమార్


కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా జాస్తి రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం రవికుమార్ వరప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీసీ ఉమేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. రవికుమార్ ఓ యూ జిల్లా పీజీ కేంద్రాల డైరెక్టర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఓయూ శతాబ్ది ఉత్సవాల కో- ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

- పరారైన నిందితులు

జగిత్యాలక్రైం: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ శివారు అటవీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, పొరుగు జిల్లాల నుంచి కోడిపందాలకు వచ్చారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. సుమారు 10 మందిని అదుపులోకి తీసుకుని కొన్ని పందెంకోళ్లను పట్టుకున్నట్లు సమాచారం. చీకటి పడటంతో కొందరు పోలీసుల కళ్లుగప్పి పారిపోయినట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని సీసీఎస్ పోలీసులు జగిత్యాలకు తరలించారు.

వివాహిత ఆత్మహత్య



భారతి(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): అప్పు ఇచ్చిన వ్యక్తి అవమానించడంతోపాటు చంపుతానని బెదించడంతో మనస్థానికి గురైన వివాహిత చిలగాని భారతి(50) శనివారం తెల్లవారుజామున చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న చిలగాని సత్యనారాయణ–భారతి దంపతులు. వీరు బట్టల షాపు పెట్టుకొని జీవిస్తున్నారు. ఆర్థిక అవసరాల కోసం సమీప బంధువు గుండ మురళి వద్ద నాలుగేళ్ల క్రితం రూ.3లక్షలు అప్పు తీసుకున్నారు. వడ్డీతో కలిపి రూ.5లక్షల వర కు గతంలోనే ముట్టజెప్పారు. అయినా, మరో రూ. లక్ష కావాలని తరచూ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 3న మధ్యాహ్నం గుండా మురళి దంపతుల ఇంటికి వెళ్లాడు. అప్పుకింద రూ.లక్ష ఇవ్వాలని అసభ్యపద జాలంతో దూషించాడు. స్థానికుల ముందే ఇ లా అవమానించడంతోపాటు చెక్‌బౌన్స్ కేసు పెడతానని బెదిరించాడు. ఈక్రమంలో శనివారం తెల్లవారు ఝామున భర్త లేచి చూడగా భార్య కనిపించలేదు. ఇంట్లో, సమీపంలో వెతికినా భారతి జాడ తె లియరాలేదు. అయితే, అదేరోజు రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె.. సమీప కోర్టు ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన హుండీ



పగులగొట్టిన పెద్దమ్మ తల్లి దేవాలయం గేటు

పాలకుర్తి(రామగుండం): కుక్కలగూడూరు గ్రామ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయ తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అమ్మవారి మె డలోని పుస్తెలు, ముక్కుపుడకతో పాటు హుండీలోని దాదాపు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయ పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ఆలయ తలుపులు పగుల గొట్టి ఉండటాన్ని చూసి గౌడకులస్తులకు సమాచార ం అందించాడు. ఈమేరకు గౌడకులస్తులు బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట శివారులోని పెద్దమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు పడి రెండు కిలోల వెండి విగ్రహం, పావు తులం బంగారు ముక్కుపుడకను ఎత్తుకెళ్లారు. అలాగే ఇట్నేని రాజు కిరాణం షాపులో చొరబడి నగదు, సుమారు రూ.20వేల విలువైన సామగ్రిని అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. దొంగలు జిల్లా సరిహద్దు అయిన ఇబ్రహీంపట్నం మండలం నుంచి కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మాస్క్‌లతో వచ్చి.. షట్టర్లు పగలగొట్టి..

- అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగల హల్‌చల్
- రహదారి పక్కన మూడు షాపుల్లో చోరీ



మాస్క్‌లు ధరించి సంచరిస్తున్న దొంగలు


మెట్‌పల్లి: మెట్‌పల్లిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న రెండు కిరాణదుకాణాల షట్టర్లు పగలగొట్టారు. లోపలికి చొరబడి క్యాష్ కౌంటర్లలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఇబ్రహీంపట్నం క్రాసింగ్ వద్ద ఉన్న ఓ హోటల్ తాళాలు పగులగొట్టారు. దొంగతనం జరిగిన దుకాణాలను సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. మాస్క్‌లు ధరించిన ముగ్గురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ముగ్గురే మొదట నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, తర్వాత మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాలలో వరుస దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

టీఆర్‌నగర్‌లో బాలిక కిడ్నాప్

జగిత్యాలక్రైం: టీఆర్‌నగర్‌లో బాలికను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన బాలికను అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన ఓ యువకుడు గత నెల 16న ప్రేమ వివాహం చేసుకున్నాడు. బాలిక మైనర్ కావడంతో పోలీసులు సఖీ కేంద్రానికి అప్పగించారు. సఖీ కేంద్రం నిర్వాహకులు బాలికను ఇటీవల కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలిక ప్రస్తుతం ఆమె టీఆర్‌నగర్‌లోని అమ్మమ్మ వద్ద ఉంటోంది. శనివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు కొందరు వచ్చి బాలికను బలవంతంగా కారులో ఎక్కించుకుని పారిపోయారని బాలిక తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

స్పీడ్ గన్స్‌తో అతి వేగానికి చెక్

- రోడ్డు ప్రమాదాల నియంత్రణ సులభం



స్పీడ్ గన్స్‌తో వాహన వేగాన్ని చిత్రీకరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కోల్‌సిటీ(రామగుండం): వాహనాల వేగానికి రామగుండం పోలీస్ కమిషరేట్ పోలీసులు చెక్ జెడుతున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో ప్రమాదాల నియంత్రణకు జాతీయ, రాష్ట్ర రహదారులపై నిర్ణీత వేగానికి మించివెళ్లే వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకోసం మూడు స్పీడ్ గన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు జిల్లా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లల్లో..

కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో గతేడాది అధిక వేగంతో వెళ్లే వాహనాలను స్పీడ్ గన్స్ ద్వారా గుర్తించారు. ఈమేరకు 7,047 కేసులు నమోదు చేసి, రూ.72.77లక్షలు జరిమానా విధించారు. రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2,460 కేసులు నమోదు కాగా, జరిమానా ద్వారా రూ.25.46 లక్షలు వసూలయ్యాయి. పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1,505 కేసులు నమోదు కాగా, జరిమానా కింద రూ.15.57 లక్షలు, మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3,082 కేసులు నమోదు కాగా, జరిమానా కింద రూ.31.73 లక్షలు జరిమానా విధించారు.

53 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు..

కమిషనరేట్ పరిధిలో నిత్యం ప్రమాదాలు జరిగే 53 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించినట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. హైవేలు, రద్దీగా ఉండే రాష్ట్ర రహదారులపై కూడా స్పీడ్ గన్స్‌తో వాహనాల వేగాన్ని బట్టి కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తున్నారు. డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలు నిర్దేశించిన వేగంతోనే వెళ్లాలని, అధిక వేగంతో వెళ్లి ప్రమాదాలు జరిగితే, కుంటుబాలు ఇబ్బందులకు గురవుతాయని పోలీసులు సూచిస్తున్నారు.

కూతురుకు పెళ్లి కావడం లేదని తండ్రి ఆత్మహత్య

రాయికల్(జగిత్యాల): అల్లారుముద్దుగా పెంచుకున్న తన కూతురుకు వివాహం కావడం లేదనే మనస్తాపంతో అయోధ్య గ్రామానికి చెందిన తుప్పతి ఐలయ్య(53) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. అయోధ్య గ్రామానికి చెందిన తుప్పతి ఐలయ్యకు కూతురు వనిత ఉంది. ఆమెకు మతిస్థిమితం లేదు. దీంతో ఇంటి వద్దే ఉంటోంది. తన కూతురుకు ఇక పెళ్లి కాదనే మనస్థాపానికి గురై ఐలయ్య.. ఈనెల 3న ఇంటి వద్ద పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.





రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను శనివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.10లక్షల ఆదాయం సమకూరింది. రాజన్నను కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి దంపతులు దర్శించుకున్నారు.